పట్టుదలతో చదవండి



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



విద్యార్థులతో కలెక్టర్

- సమ్మర్ క్యాంపును సందర్శించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్
- విద్యార్థులతో మాటామచ్చట

పెద్దపల్లిరూరల్: సమాజసేవలో భాగస్వాములయ్యేలా ఉన్నత స్థానాల్లో ఉండాలంటే ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకుని పట్టుదల, కృషితో దాన్ని అధిగమించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. పెద్దపల్లిలోని అమర్‌నగర్ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్‌క్యాంపును శుక్రవారం డీఈవో మాధవితో కలిసి సందర్శించారు. వేసవి సెలవుల్లో ఆటపాటలతో విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు దోహదపడతాయనే ఆలోచనతో సమ్మర్‌క్యాంపులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

విద్యార్థులతో మాటామచ్చట..

సమ్మర్ క్యాంపులో విద్యార్థులతో పాటు నేలపైనే కూర్చుని కాసేపు ముచ్చటించి వారు ఎంచుకున్న లక్ష్యాలను సాధించేందుకు అనుసరించే పద్ధతులపై ఆరా తీశారు కలెక్టర్. 'నేను డాక్టర్‌నవుతా.. ఆర్టిస్టు కావాలనుంది.. సైన్యంలో చేరాలనే ఆసక్తి ఉంది.. ఏరోనాటికల్ ఇంజనీర్‌నవుతా..' అంటూ పలువురు విద్యార్థులు తమ మనోభావాలను వెల్లడించారు. ప్రతి విద్యార్థి ఎంచుకున్న లక్ష్యసాధనకు కఠోరశ్రమ చేస్తే సత్ఫలితాలొస్తాయని కలెక్టర్ వివరించారు. లక్ష్యసాధనకు అనుగుణంగా సన్నద్ధులు కావాలని, అందుకు ఆరోగ్యంగా ఉండాలని, ఆరోగ్యం కోసం మంచి ఆహార అలవాట్లను అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు.

ఆటోగ్రాఫ్ ప్లీజ్...

సమ్మర్ క్యాంపునకు హాజరైన విద్యార్థులు తాము వేసిన పెయింటింగ్‌లను కలెక్టర్‌కు చూపించి ఆటోగ్రాఫ్ ఇవ్వాలంటూ అభ్యర్థించారు. కలెక్టర్ వాటిపై ఆటోగ్రాఫ్ ఇస్తూ పెయింటింగ్ చేసిన విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వలంటీర్ మితేష్ సింగ్ ఉన్నారు.

క్లుప్తంగా

ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రామగిరి: సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని, ఎటువంటి ఆటంకం లేకుండా ప్రమోషన్లు ఇవ్వాలని ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలో జీఎం ఎస్.సుధాకర్‌రావుకు ఏఐటీయూసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. 121వ బ్యాచ్ నుంచి 136వ బ్యాచ్ వరకు ఉన్న ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించి గ్రేడ్‌లు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రాన్ని అందించిన వారిలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ వై.వి.రావు, సెంట్రల్ సెక్రటరీ జూపాక రాంచందర్, ఏపీఏ, ఓసీపీ–1, 2 పిట్ సెక్రటరీలు గంగాధర్, డీటీ రావు, క్రాంతితో పాటు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి



పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

పెద్దపల్లిరూరల్: గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వర్షాకాలంలో రోడ్లు, ఇతర ప్రాంతాల్లో నీరు నిలవకుండా చర్యలు చేపట్టాలని పెద్దపల్లి డీఎల్‌పీవో వేణుగోపాల్ ఆదేశించారు. పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో శుక్రవారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. నీరు నిలవడంతో దోమలు వృద్ధి చెంది రోగాలు ప్రబలే అవకాశముందన్నారు.

పెద్దకొమిరలో కళాజాత ప్రదర్శన



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

ఓదెల: మండలంలోని పెద్దకొమిరలో ఎండాకాలంలో వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు కళాజాత ప్రదర్శనలు చేశారు. కళాజాత కళాకారులు జనగామ రాజనర్సు, బుర్ర శంకర్‌గౌడ్, ఈదునూరి పద్మ, కొండ్ర వెంకన్న ఆధ్వర్యంలో ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆటపాటలతో వివరించారు. అలాగే రాబోయే సీజన్‌లో వ్యాప్తిచెందే అంటువ్యాధుల గురించి వివరించారు. పరిసరాల పరిశుభ్రత, బేటీ పడావో బేటీ బచావోపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

కార్పొరేటర్‌కు సన్మానం



సన్మానిస్తున్న ప్రతినిధులు

రామగుండం: శ్రీమద్విరాట్ శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి 331వ ఆరాధన, 2వ భజన సప్తాహ మహోత్సవ వేడుకలను పురస్కరించుకొని గోదావరిఖనిలోని శ్రీకాశీ శివలింగ సహిత శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం స్థానిక కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్‌ను సత్కరించారు. ట్రస్టు చైర్మన్ మామిడిపెల్లి భాస్కర్, ఉత్సవ కమిటీ కన్వీనర్ గుగ్గిళ్ల రవీంద్రచారి, కజాంపురం ప్రభాకరచారి, కట్ట సత్యనారాయణ, పానుగంటి స్వామి, ముత్తోజు వెంకటచార్యులు, కట్టా సురేశ్ ఉన్నారు.

పేదలకు చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ సాత్విక్, క్యాషియర్ శ్వేత

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలోని పేదలకు శుక్రవారం చీరలు పంపిణీ చేశారు. ప్రేమ చారిటబుల్ ట్రస్ట్, పర్ఫెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు దాసరి స్వప్నమహేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌బీఐ లింగాపురం బ్రాంచి క్యాషియర్ శ్వేత, సింగరేణి ఉద్యోగి గుంపుల శ్రీనివాస్ సౌజన్యంతో బ్రాంచి మేనేజర్ సాత్విక్ చేతుల మీదుగా చీరలు పంపిణీ చేశారు. బండి చంద్రమౌళి, కిషోర్ యాదవ్, లింగయ్య యాదవ్ పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టిసారించాలి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎంపీడీవో

రామగుండం: వర్షాకాలం సీజన్ సమీపిస్తుండడంతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనులపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీడీవో ఎంఏ.అలీం ఆదేశించారు. గ్రామంలో సేకరించిన చెత్తను చెత్త డంపింగ్ యార్డుకు తరలించి తడి–పొడిగా వేర్వేరుగా విభజించి కంపోస్టు ఎరువు ఉత్పత్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. కాగా శుక్రవారం అంతర్గాం మండల పరిధిలోని పెద్దంపేట, రాయదండి గ్రామాల్లో పర్యటించారు. పలు అంశాలపై సంబంధిత గ్రామస్థాయిలో అధికారులను ఆదేశించారు. రాబోయే వర్షాకాలం సీజన్ ఆరంభంలోనే గ్రామాల వారీగా హరితహారంలో భాగంగా మొక్కలు నాటాల్సి ఉంటుందని, ఇందుకు ఆయా గ్రామాల నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కల వివరాలు, గ్రామంలో మొక్కలు నాటే సంఖ్యకు సరిపడా ఉత్పత్తి తదితర అంశాలపై నర్సరీలో పరిశీలించారు. ఉపాధి హామీ పథకం నిబంధనలకు లోబడి నమోదు చేసుకున్న ఉపాధి కూలీలు తమ పేర్లను ఆన్‌లైన్‌లోనే పునరుద్ధరించుకోవాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో పునరుద్ధరించుకోని ఉపాధి కూలీలు సంబంధిత ఈజీఎస్ అధికారులను సంప్రదించాలన్నారు. అనంతరం ఎంపీడీవో ఆయన ఛాంబర్‌లో ఈజీఎస్ ఈసీ అయ్యూబ్‌ఖాన్‌తో సమావేశమై గ్రామాల్లో చేపట్టాల్సిన నూతన పనులు, పూర్తి చేసిన పనుల వివరాలపై ఇంజనీరింగ్ కన్సల్టెన్సీతో సమీక్షించారు.

కాలువలో పూడికతీత



రామగుండం: రానున్న వర్షాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని రామగుండం పట్టణంలోని ప్రధాన కాలువలో ఎన్టీపీసీ సంస్థ జేసీబీ సాయంతో పూడిక తొలగిస్తున్నారు. కుందనపల్లి సమీపంలోని ఎన్టీపీసీకి బూడిద చెరువు నుంచి వెలువడే నీరు పట్టణంలోని పెద్ద కాలువ ద్వారా చెరువులోకి చేరుతుంది. ప్రతి ఏటా భారీ వర్షాలతో కాలువలోని వరద నీరు ఉప్పొంగి సమీపంలోని జెన్ క్వార్టర్లు, పాతబజార్ ఇతరత్రా కాలనీలను ముంచెత్తుతుంది. ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు కాలువలో పెరిగిన పిచ్చి మొక్కలు, నాచు తదితర అడ్డంకులను తొలగించి ఎలాంటి అడ్డంకులు లేకుండా వరద నీరు వెళ్లేలా పూడికతీత పనులు చేపడుతున్నారు.

శిథిలావస్థలో జెన్‌కో క్వార్టర్లు



ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

రామగుండం: పట్టణంలోని బీ–థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని నడిపించడంపై ఉన్న శ్రద్ధ కార్మికుల సంక్షేమంపై లేకపోవడంతో పలువురు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీల్లో కొనసాగుతున్న హౌస్ కీపింగ్ పనులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక ఐఎన్‌టీయూసీ కార్యాలయం ఎదుట ఉన్న జెన్‌కో క్వార్టర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరాయి. వాటి ప్రాంగణంలో పిచ్చి మొక్కలు పెరిగి, విష ప్రాణులు సంచరిస్తూ కనీసం క్వార్టర్లు సైతం కనిపించకుండా పోతున్నాయి. దాని ఎదుట మురికి కూపంలో పందులు తిరుగుతుండడతో దుర్వాసన, దోమలతో పక్కనున్న క్వార్టర్లలో ఉన్న ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. శిథిలావస్థకు చేరిన క్వార్టర్ల ఎదుట ఉన్న డ్రైనేజీలో తాగునీటి కుళాయికి రంధ్రం పడడంతో నీరు వృథాగా పోతోంది. సంబంధిత అధికారులు, మున్సిపల్‌శాఖ స్పందించి చర్యలు తీసుకోవలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయంలో ఉన్న హనుమాన్ విగ్రహం వద్ద పూజారి మహేశ్ శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ దీక్షాపరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం



అన్నదానం చేసిన దాతతో దీక్షాపరులు

రామగుండం: స్థానిక రైల్వేస్టేషన్ ఏరియాలోని శ్రీషిర్డీసాయిబాబా మందిర సముదాయంలోని శ్రీహనుమాన్ దేవాలయంలో శుక్రవారం మాలధారణ స్వాములు హనుమాన్ చాలీసా పారాయణం చేసి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఈ సందర్భంగా వారికి రైల్వే ఉద్యోగి తమ్మడి నర్సింగరావు–విజయలక్ష్మి దంపతులు అన్నదానం చేసి స్వాముల ఆశీర్వచనలు స్వీకరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని పలు ఏరియాల్లో మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు గౌతమినగర్, జనగాం, రాంమందిర్, అల్లూరు, పీజీ సెంటర్ విద్యుత్ ఉప కేంద్రాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

సంక్షిప్త వార్తలు

గీత కార్మికుడికి గాయాలు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామానికి చెందిన బండి శ్రీనివాస్ అనే గీతకార్మికుడు తాటిచెట్టు ఎక్కబోతుండగా అదుపుతప్పి గురువారం కిందపడ్డాడు. గాయాలు కావడంతో స్థానికులు పెద్దపల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. గాయపడ్డ కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలని గౌడసంఘం నాయకులు కోరారు.

విద్యుదాఘాతంతో గేదెలు మృతి

మంథని: ఖానాపూర్ గ్రామంలో శుక్రవారం అమ్మకుంటి సమ్మయ్యకు చెందిన రెండు గేదెలు విద్యుదాఘాతంతో మృత్యువాత పడ్డాయి. మేతకు వెళ్లి ప్రమాదానికి గురయ్యాయి. వీటి విలువ సుమరు 1.60లక్షల వరకు ఉంటుందని బాధితుడు ఆవేదన చెందాడు.

షెడ్డు కూల్చివేసి సామగ్రి తీసుకెళ్లిన కేసులో ఇద్దరు అరెస్టు

జ్యోతినగర్: రేకుల షెడ్డు కూల్చివేసి వస్తువులను తీసుకెళ్లిన ఇద్దరు మహిళలను ఎన్టీపీసీ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ ఇందిరమ్మకాలనీలోని సుజాతకు చెందిన రేకుల షెడ్డును కూల్చివేసి వస్తువులను తీసుకెళ్లారు. అంతేకాకుండా స్థలాన్ని ఆక్రమించుకోవాలని అదే కాలనీకి చెందిన వసంత, స్వర్ణలత ఇంటి వస్తువులను తీసుకెళ్లారని బాధితురాలు ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ చేపట్టిన అనంతరం శుక్రవారం ఇరువురిని అరెస్టు చేసి జడ్జి ఎదుట హాజరుపరిచినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు.

మంజుశ్రీకి నివాళి

పాలకుర్తి: కేశోరాం ఇండస్ట్రీస్ చైర్మన్ మంజుశ్రీ ఖైతాన్ మృతిపై కేశోరాం పర్మినెంట్ కార్మికసంఘం నాయకులు సంతాపం ప్రకటించారు. బి.కె.బిర్లా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత బసంత్‌కుమార్ బిర్లా కుమార్తె అయిన మంజుశ్రీ ఖైతాన్ అనారోగ్యం కారణంగా గురువారం కలకత్తాలో మరణించింది. శుక్రవారం బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారంలో సంతాప సభ నిర్వహించారు. కేశోరాం పర్మినెంట్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్శవేని శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ముత్తారం: మండలంలోని ధర్యపూర్ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు 31లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వివాహిత అదృశ్యం



పాపతో రజిత

గోదావరిఖని: స్థానిక భరత్‌నగర్‌కు చెందిన దాసరపు రజిత(23) గురువారం ఇంట్లో నుంచి వెళ్లి తిరిగిరాలేదని పోలీసులు తెలిపారు. మూడేళ్ల క్రితం రజనీకాంత్‌తో వివాహం జరగ్గా 21నెలల పాప ఉన్నట్లు పేర్కొన్నారు. భార్య, భర్తలకు మధ్య గొడవ జరగడంతో మనస్తాపం చెంది రజిత, తన కూతురు అనన్యతో ఇంట్లోనుంచి వెళ్లిపోయిందన్నారు. రజిత తల్లి సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 87126 56516, 90100 72555 నంబర్లకు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



శుభ్రం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ కోరారు. శుక్రవారం పలు ప్రాంతాల్లో వర్షం కురవడంతో డ్రైనేజీల్లో నిలిచిన నీటిని మున్సిపల్ కార్మికులతో శుభ్రం చేయించారు. డ్రైనేజీ చుట్టుపక్కల ఉన్న ఇంటి యజమానులు ప్లాస్టిక్ కవర్లు, సీసాలు వేయడంతో డ్రైనేజీలు జామ్ అవుతున్నాయని, అలా చేయడం సరికాదని సూచించారు. అకాల వర్షాలతో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్నామని వారు తెలిపారు. విద్యుత్ సమస్యను సైతం విద్యుత్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామన్నారు.

రైతులు అధైర్య పడొద్దు



తేమ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రవాణా వేగవంతం చేయాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని కొలనూర్ గ్రామంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ అకాల వర్షాలకు రైతులు అధైర్య పడొద్దని సూచించారు. రైతులు మాయిశ్చర్ వచ్చేలా ధాన్యం ఆరబెట్టాలన్నారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను ఎప్పటికప్పుడు వేగిరం చేయాలన్నారు. కార్యక్రమంలో పొత్కపల్లి సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి, మాజీచైర్మన్ గోపు నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేంసాగర్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి రవిగౌడ్, మాజీ ఎంపీటీసీ పర్శ రమేశ్, మాజీ సర్పంచులు సామ శంకర్, కుంచం మల్లయ్య పాల్గొన్నారు.

ముగిసిన ఆరాధన మహోత్సవాలు



ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామివారి ఆరాధన మహోత్సవాలు శుక్రవారం ముగిశాయి. ముగింపులో ఉదయం స్వామివారి ద్వాదశాక్షరి మహామంత్ర యజ్ఞం–పూర్ణాహుతి, భజన సప్తాహం, గోపాల కలువలు మహా నివేదన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన వితరణ కార్యక్రమం చేపట్టారు. సాయంకాలం దీపాలంకరణ, పల్లకిసేవ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ చైర్మన్ మామిడిపల్లి భాస్కర్, ప్రధాన కార్యదర్శి కుజాంపురం ప్రభాకర్, ఉత్సవ కమిటీ కన్వీనర్ గుగ్గిల రవీంద్రచారి, మామిడిపల్లి శ్రీధర్, సుధాకర్, సత్యనారాయణ, మోహనచారి, విద్యాసాగర్, శ్రీనివాసచారి, సదానందం, పురుషోత్తం పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు.. తీరిన లోవోల్టేజీ సమస్య



ట్రాన్స్‌ఫార్మర్లను ప్రారంభిస్తున్న ఏడీఈ, కార్పొరేటర్

గోదావరిఖనిటౌన్: మేదరిబస్తీలో రెండు నూతన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో బస్తీవాసుల లోవోల్టేజీ సమస్య ఇన్నాళ్లకు తీరిందని స్థానిక కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్ అన్నారు. గోదావరిఖని ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్, కార్పొరేటర్ బాలరాజ్‌కుమార్ రెండు నూతన ట్రాన్స్‌ఫార్మలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతు 20ఏళ్లుగా బస్తీ ప్రజలు లోవోల్టేజీ కరెంటుతో చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. సమస్యను ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లడంతో విద్యుత్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈ సంపత్, లైన్‌మెన్ రాచకట్ల శ్రీనివాస్, బస్తీవాసులు శంకర్, కృష్ణమాచారి, బ్రహ్మం, స్వరాజ్యం, శ్రీనివాస్, కనుకయ్య, రాజయ్య, సమ్మయ్య, సాయి పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం



అన్నదానం చేస్తున్న రాజగోపాల్

సుల్తానాబాద్: మహిళా చట్టాలపై అవగాహన అవసరమని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజగోపాల్ అన్నారు. మండల కేంద్రంలోని దివ్యాంగుల పునరావాస కేంద్రంలో శుక్రవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల చట్టాలపై, సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాలిక చదువు, పరిసరాల పరిశుభ్రత, టోల్ ఫ్రీ నంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ దయా అరుణ, జెండర్ స్పెషలిస్ట్ సుచరిత, స్వప్న, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, వలస నీలయ్య, ఐసీడీఎస్ సీడీపీవో కవిత, ఏపీఎం శ్రీనివాస్, గీత ఉన్నారు.

ట్రాన్స్‌కో ఎస్ఈ సుదర్శన్ సేవలు అభినందనీయం



ఎస్ఈ సుదర్శన్‌ను అభినందిస్తున్న నాయకులు, వ్యాపారులు

పెద్దపల్లిరూరల్: జిల్లావ్యాప్తంగా విద్యుత్ సేవలు మెరుగ్గా అందించి ఎన్పీడీసీఎల్ పరిధిలో అగ్రస్థానంలో పెద్దపల్లి జిల్లాను నిలపడం అభినందనీయని కాంగ్రెస్ నాయకుడు ముడుసు సాంబిరెడ్డి పేర్కొన్నారు. మెరుగైన సేవలందించిన ఎస్ఈని శుక్రవారం సత్కరించారు. విద్యుత్‌శాఖలో పనిచేసే అధికారులు, సిబ్బంది సహకారంతోనే అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సేవలందించగలిగామని సుదర్శన్ అన్నారు. వినోద్‌రెడ్డి, దేవసాని ధర్మయ్య, ఎడ్ల మహేందర్, రాంరెడ్డి ఉన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

జూలపల్లి: గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లలో అధికారులు వేగం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేశ్ డిమాండ్ చేశారు. జూలపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, హమాలీ కార్మికుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కజొన్న సీజన్ ప్రారంభమైనందున రైతులు ఇబ్బందులు పడకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. ధాన్యం కుప్పలు పోసి 15రోజులు దాటినా, కొనుగోళ్లలో వేగం పెంచకపోవడంతో స్థలం సమస్య ఉత్పన్నం అవుతోందన్నారు. పొలం మడుల్లో పోసిన ధాన్యం కుప్పలు మొలకలు వచ్చే అవకాశం ఉందన్నారు. అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచి అన్నదాతల ఇబ్బందులు తొలగించాలని కోరారు. ఆవుల రాజు, మల్లెత్తుల ఆంజనేయులు, పొట్టాల నది ఉన్నారు.

వైభవంగా పరమ పదోత్సవం

ఎలిగేడు: మండలంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీమదలమేల్మంగా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి తిరుక్కల్యాణోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయంలో ఉదయం ప్రబంధ సేవాకాలం, పురపాట్టుసేవ, సాయంత్రం శాత్తుమురై తీర్థ ప్రసాద వినియోగం వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగవతచరణ రేణువు రామిడి వెంకటరామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కొండల్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ బస్తాలు

సుల్తానాబాద్: పట్టణంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జీలుగ బస్తాలు అందుబాటులో ఉన్నాయని సింగిల్ విండో కార్యదర్శి సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. 30కేజీల బస్తా రూ.1116 ఉంటుందని, అవసరమున్న రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్‌తో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ వెంట తీసుకొని రావాలన్నారు. సొసైటీ పరిధిలో ఉన్న రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.